కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

నారాయణ స్తోత్రమ్ - భావార్థముతో

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

Kiron Type Institute

నారాయణ స్తోత్రమ్

01. నారాయణ! నారాయణ! జయగోవింద! హరే!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

సముద్రమున వసించువాడా, ఇరువది నాలుగు తత్వములు కలవాడా, సగుణ నిర్గుణ స్వరూపము కలవాడా, సృష్టికర్తృత్వము సంహారకర్తృత్వము స్వీకరించినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

గోవిందుడు అయిన స్వామి నారాయణునకు జయము. గోపాలుడు అయిన నారాయణునకు జయము.

02. కరుణా పారావార! వరుణాలయ గంభీర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

ఓ దయాసముద్రుడా, గంభీరసముద్రుడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

03. ఘన నీరద సంకాశ కృతకలికల్మషనాశ!।
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

నల్లటిదట్టమైన మబ్బువంటి శరీరము కలవాడా, కలికాలమున చేసే పాపములను నాశనము చేయువాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

04. యమునా తీరవిహార! ధృతకౌస్తుభ మణిహార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

యమునానదితీరాన గో గోపికలతో విహరించేవాడా, కౌస్తుభమణిహారమును ధరించేవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

05. పీతాంబర పరిధాన! సురకళ్యాణ నిధాన!

నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

బంగారు పట్టువస్త్రములు ధరించినవాడా, సురకళ్యాణానికి నిధివి, అట్టి స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

06. మంజులగుంజాభూష మాయా మానుష!

నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

మాయామానుషవేషధారి, మనోహరమైన గురివింద పూసలను దండగా ధరించినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

07. రాధాధరమధురసిక! రజనీచరకులతిలక!

నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

రాధాదేవి అధరమాధుర్యమును గ్రోలినవాడా, చంద్రవంశమునకు అలంకారమైనవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

08. మురళీగాన వినోద! వేదస్తుత భూపాద!

నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

మురళీగానముతో వినోదించువాడా, భూమి పాదములు, గగనము శిరస్సు అని వేదములచే కొనియాడ బడేవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

09. బార్హిణబరహాపీడ! నటనాటక! ఫణిపీడ!

నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

కిరీటమున తురాయిగా నెమలిపింఛమును ధరించినవాడా, నటుని వలె నటించుచు, కాళియసర్పము నణచినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

10. వారిజ భూషాభరణ! రాజీవ రుక్మిణీరమణ!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

నీటబుట్టిన శంఖమును ఆభరణముగా కలవాడా, లక్ష్మీ అవతారమైన రుక్మిణీదేవిని ఆనందపరచువాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

11. జలరుహదళనిభనేత్ర! జగదారంభక సూత్ర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

తామరరేకులవంటి కన్నులుగల వాడా, జగన్నాటక సూత్రధారి, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

12. పాతకరజనీ సంహర! కరుణాలయ! మాముద్ధర।
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

పాపమనెడి కాళరాత్రిని సంహరించు వాడా, నీవు దయాసముద్రుడవు, నన్నుద్ధరించుము. స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

13. అఘబకక్షయ! కంసారే! కేశవ! కృష్ణ! మురారే!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

ఓ గోపాల! పాపాత్ములైన బకుడు, కంసుడు, మురుడు మొదలైన రాక్షసులను సంహరించినవాడా! స్వామీ! అందమైన కేశములతో అందరినీ ఆకర్షించు స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

పాపాత్ములైన బకుడు, కంసుడు మొదలైన రాక్షసులను సంహరించినవాడా, కేశవ – కృష్ణ – మురారీ – అనే నామములతో పిలవబడేవాడా, స్వామీ నారాయణ గోపాలా నీకు జయము

14. హాటక నిభపీతాంబర! అభయం కురుమే మావర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

బంగారమువంటి పట్టుపీతాంబరములు ధరించినవాడా, నాకభయమొసంగుము స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

15. గోవర్ధనగిరి రమణ! గోపీ మానస హరణ!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

దేవేంద్రుని గర్వభంగముచేయనెంచి పసివాడుగానే గోవర్ధనమునెత్తి గోగోపజనమును కాపాడి వారి మనముల నాకర్షించిన స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

16. దశరథరాజ కుమార! దానవమద సంహార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

దశరథరాజతనయా, దానవసంహారా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

17. సరయూ తీరవిహార! సజ్జన ముని మందార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

సరయూతీరవిహారా, సజ్జనమునుల కోర్కెలను దీర్చు స్వభావము కలవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

18. విశ్వామిత్ర మఖత్ర! వివిధ పరాసు చరిత్ర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

విశ్వామిత్రుని యజ్ఞమును సంరక్షించినవాడా, మృతులను సైతము బ్రతికించిన చరిత్ర కలవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

19. ధ్వజ వజ్రాంకుశపాద! ధరణీజని సహమోద!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

ధ్వజము - వజ్రము - అంకుశము మొదలగు ఉత్తమ రేఖలతో ఉత్తమ సాముద్రిక లక్షణములతో నొప్పుపాదములుగల స్వామీ సీతాదేవితో నిత్యానందము నొందు స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

20. జనకసుతాప్రతిపాల! జయ జయ సంస్మృత లీల!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

సీతాదేవిని పాలించువాడా, నీ లీలలు సదా ఎల్లరు తలచుకొంటూంటారు. స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

21. దశరథ వాగ్ధృతభార! దండక వనసంచార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

తండ్రియగు దశరథుని మాటను శిరసా వహించినవాడా, దండకారణ్యమున సంచరించినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

22. ముష్టిక చాణూర సంహార ముని మానస సువిహార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

చాణూర ముష్టికులనే దుష్టమల్లులను సంహరించి ముని మానసముల కానందమును కూర్చినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

23. వాలి వినిగ్రహ శౌర్య! వసుగ్రీవ హితార్య
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

వాలిని వధించిన శూరుడా, శరణు జొచ్చిన సుగ్రీవుని ఆదరించిన ఓ రామా! స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

24. మాం మురళీకర! ధీవర! పాలయపాలయ శ్రీధర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

మురళీధరా, ధీవరా, శ్రీధరా నన్ను కాపాడుము. స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

25. జలనిధి బంధన ధీర! రావణ కంఠవిదార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

సముద్రమునకు వంతెన కట్టిన ధీరుడా! రావణుని కంఠములను నరికి ప్రోవులు చేసినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

26. తాళీవన దళనాఢ్య! నటగుణ! వివిధధనాఢ్య!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

గర్దభాసురుని సంహరించి తాటితోపును ధ్వంసము చేసి మాయా మానుషత్వమును నటించుచు వివిధములైన సంపదలతో విరాజిల్లువాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

27. గౌతమ పత్ని పూజన కరుణా ఘనావలోకన
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

గౌతమపత్నిచే పూజలనందుకొన్నవాడా, గొప్ప కరుణతో నిండిన చూపులతో ఆమెను ఉద్ధరించినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

28. సంభ్రమ సీతాహార! సాకేత పుర విహార!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

గొప్ప సంభ్రమ పరాక్రమములతో శత్రువుని జయించి సీతను తీసుకుని వచ్చి సాకేతపురమున పట్టాభిషిక్తుడవై విహరించిన ఓ రామా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

29. అచలోద్ధృతి చంచత్కర! భక్తాను గ్రహతత్పర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

చిటికనవ్రేలితో గోవర్ధన పర్వతమునెత్తిన వాడా, భక్తుల ననుగ్రహించుటలో తదేక నిష్ఠ కలవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

30. నైగమగానవినోద! రక్షస్సుతప్రహ్లాద!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

నిన్ను గురించి వేదములు చేయునట్టి గానమును వినోదించువాడా, హిరణ్యకశిపుని సుతుడైన ప్రహ్లాదుని ఆనందింపచేయు కళ్యాణగుణా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

31. భారతయతివర శంకర నానామృత వచనాంతర!
నారాయణ! నారాయణ! జయగోపాల! హరే॥

భారతదేశమున యతి శ్రేష్ఠుడైన శంకరాచార్యుని అమృత ప్రాయములైన వివిధస్తుతులతో నిండియున్న సగుణ, నిర్గుణ స్వరూపముగలవాడా ఓ స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

// ఇతి శ్రీ శంకరాచార్య విరచిత నారాయణ స్తోత్రమ్ సంపూర్ణమ్ //

– – – = – – –

ఏకశ్లోకీ భాగవతం

ఆదౌ దేవకీదేవి గర్భజననం గోపీ గృహేవర్ధనం
మాయాపూతన జీవితాపహరణం గోవర్ధనోద్ధారణమ్।
కంసచ్ఛేదన కౌరవాది హననం కుంతీసుతాపాలనం
హ్యేతద్భాగవతం పురాణకథితం శ్రీకృష్ణలీలామృతమ్॥

–– – × – – –

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

